సాక్షి
ఖమ్మం
శనివారం । 25 । మార్చి । 2023




బతకనిద్దాం.. ఎదగనిద్దాం
నేడు భ్రూణహత్యల వ్యతిరేక దినం సందర్భంగా కట్టడికి అధికారులు తీసుకుంటున్న చర్యలపై ప్రత్యేక కథనం. 10లో



మా కృషితోనే పరిహారం
కమ్యూనిస్టుల విజ్ఞప్తితోనే రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం విడుదల చేసిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని తెలిపారు. 8లో

గరిష్టం / కనిష్టం
36° / 24°

వాతావరణం
జిల్లాలో శనివారం ఉక్కపోత వాతావరణం ఉంటుంది. ఉదయం నుంచే ఎండ మొదలై మధ్యాహ్నానికి పెరుగుతుంది.



కౌలు కష్టానికి ఊరట


నేలవాలిన మొక్కజొన్న చేనులో వట్టికొండ రామకృష్ణ దంపతులు

సీఎం కేసీఆర్ భరోసా కల్పించారు..

నేను 35 ఎకరాల్లో మొక్కజొన్న సాగుచేస్తే ఇందులో 33 ఎకరాలు కౌలు భూమే. కౌలు, పెట్టుబడి కలిపి ఎకరాకు రూ.50 వేలు ఖర్చయింది. పంట చేతికందే సమయాన అకాల వర్షం దెబ్బతీసింది. సీఎం కేసీఆర్ నాతో మాట్లాడి ఎకరాకు రూ.10 వేల చొప్పున ఇస్తామని భరోసా కల్పించడం సంతోషంగా ఉంది.
– వట్టికొండ రామకృష్ణ, కౌలు రైతు, రావినూతల

అకాల వర్షాలతో నష్టపోయింది అధికంగా కౌలు రైతులే..
- సాయం అందిస్తామన్న సీఎం ప్రకటనతో ఆశలు
- గణాంకాలు తేల్చేందుకు అధికారుల కసరత్తు
- మార్గదర్శకాలు విడుదలైతే త్వరలోనే సాయం

అ'కాలం' మింగేసింది..
యాసంగిలో సాగు చేసిన కొన్ని పంటలు వర్షార్పణమయ్యాయి. మిగిలిన పంటల పరిస్థితి ఎలా ఉన్నా.. మొక్కజొన్న పంటపై వర్ష ప్రభావం తీవ్రంగా ఉంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 20,890 మంది రైతులకు చెందిన 33,357 ఎకరాల్లో మొక్కజొన్న పూర్తిగా నేలవాలి పనికి రాకుండా పోయింది. ఆ తర్వాత ఖమ్మం జిల్లాలో పెసర, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో వరి పంటలు దెబ్బతిన్నాయి. ప్రధానంగా ఖమ్మం జిల్లాలోని బోనకల్, చింతకాని, కొణిజర్ల, వైరా తదితర మండలాల్లో అకాల వర్షాలతో మొక్కజొన్న పంట తుడిచిపెట్టుకుపోయింది.

సాక్షిప్రతినిధి, ఖమ్మం: అకాల వర్షం కౌలు రైతుల ఆశలపై నీళ్లు చల్లింది. దెబ్బతిన్న పంటను చూసి కౌలు రైతు తీవ్ర నిరాశకు గురైన వేళ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటన వారికి ఊరట కలిగించింది. ఇటీవల వర్షాలు, గాలిదుమారానికి ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని 21,250 మంది రైతులకు చెందిన 34,208 ఎకరాల్లో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. గురువారం ఖమ్మం జిల్లా బోనకల్ మండలంలో దెబ్బతిన్న పంటలను పరిశీలించిన ముఖ్యమంత్రి కేసీఆర్ కౌలు రైతులను కూడా ఆదుకుంటామని హామీ ఇవ్వడంతో గతంలో ఎన్నడూ సాయం పొందని వారిలో ఆనందం వ్యక్తమవుతోంది. ఇప్పటికే ఎకరానికి రూ.10వేల చొప్పున పరిహారానికి సంబంధించి జీఓ జారీ కావడంతో జిల్లాలో కౌలు రైతుల లెక్కలను తేల్చే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.

కౌలు రైతులకు అండగా..
ఈనెల 17 నుంచి 21 మధ్య కురిసిన అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటల్లో అత్యధికం కౌలు రైతులు సాగు చేసినవే ఉన్నాయి. ఆయా రైతులు ఇప్పటికే కౌలు చెల్లించడమే కాక పెట్టుబడికి రూ.లక్షల్లో వెచ్చించడంతో అప్పులు ఎలా తీర్చాలనే బెంగతో కొట్టుమిట్టాడుతున్నారు. ఈ క్రమంలో గురువారం జిల్లాలో పంటలను పరిశీలించిన సీఎం కేసీఆర్ కౌలు రైతులకూ సాయం చేస్తామని ప్రకటించారు. కొందరు కౌలు పూర్తిగా చెల్లించామని, మరికొందరు సగమే చెల్లించామని సీఎం దృష్టికి తీసుకురాగా.. పంట సాగు చేసి నష్టపోయిన వారందరికీ సాయం అందేలా చర్యలు తీసుకుంటామని కేసీఆర్ హామీ ఇచ్చారు. ఖమ్మం జిల్లాలో మొత్తం 19,732 మంది రైతులు నష్టపోయినట్లు ప్రాథమికంగా అంచనా వేయగా.. ఇందులో 60 శాతం మంది కౌలు రైతులే ఉంటారని వ్యవసాయ శాఖ అధికారులు భావిస్తున్నారు.

తెలంగాణ రాకముందు అర్హత కార్డులు
ఉమ్మడి జిల్లాలో నష్టపోయిన కౌలు రైతులను గుర్తించే పనిలో అధికార యంత్రాంగం నిమగ్నమైంది. ఖమ్మం జిల్లాలో కౌలు రైతులు ఎక్కువగా ఉన్నారని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకురావడంతో వారిని గుర్తించేలా కలెక్టర్లను ఆదేశాలు ఇప్పిస్తామని పేర్కొన్నారు. ఈమేరకు కౌలు రైతుల గుర్తింపు ప్రక్రియ సాగుతోంది. ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు నష్టపోయిన పంటలకు ఎకరానికి రూ.10 వేలు చొప్పున సాయం అందించేందుకు ఇప్పటికే జీఓ జారీ కాగా, మార్గదర్శకాలు విడుదల కావాల్సి ఉంది. అలాగే కౌలు రైతులను కూడా గుర్తించాల్సి ఉండడంతో ఆయా అంశాలపై సీఎస్ శుక్రవారం కలెక్టర్లు, వ్యవసాయశాఖ అధికారులతో వీసీ ద్వారా సమీక్షించారు. తెలంగాణ ఏర్పడక ముందు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో దాదాపు లక్ష మంది కౌలు రైతులు ఉన్నట్లు గుర్తించి వారికి పంట రుణాల నిమిత్తం అర్హత కార్డులు జారీ చేశారు. అయితే ప్రస్తుతం కౌలు రైతులు ఎందరు ఉంటారనే గణాంకాలు తేల్చడంలో అధికారులు నిమగ్నమయ్యారు. ఇక గతంలో పంట నష్టపరిహారం జరిగినప్పుడు వ్యవసాయ, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా ఇచ్చే నివేదిక ఆధారంగా 33 శాతం పంట దెబ్బతింటేనే సాయం అందించేవారు. అయితే ఈసారి ఏ ప్రాతిపదిక సాయం చేస్తారో తేలాల్సి ఉంది.

ఉమ్మడి జిల్లాలో రైతుల వివరాలు

జిల్లా	పాస్‌పుస్తకం ఉన్న రైతులు	కౌలు రైతులు (అంచనా)
ఖమ్మం	3,13,628	1,60,000
భద్రాద్రి కొత్తగూడెం	1,46,000	60,000

కౌలు రైతులను ఆదుకుంటున్నారు..

కేసీఆర్ మాలాంటి కౌలు రైతులను ఆదుకుంటున్నారు. యాసంగిలో 11 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేస్తే కౌలు, పెట్టుబడి కలిపి రూ.5.50లక్షలు అయింది. కానీ అకాల వర్షంతో పంట పోయింది. గతంలో ఎన్నడూ లేనట్లుగా కౌలు రైతులకూ సాయం చేస్తామని సీఎం ప్రకటించడం ఆనందంగా ఉంది.
– చేబ్రోలు మల్లికార్జునరావు, కౌలురైతు, రావినూతల

వార్షికోత్సవ సంబరం


'సాక్షి' దినపత్రిక 15వ వార్షికోత్సవ వేడుకలు ఖమ్మం యూనిట్ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా జరిగాయి. వివిధ విభాగాల ఇన్‌చార్జ్‌లు, ఉద్యోగులు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. 'సాక్షి'లో ఇన్నేళ్లుగా తమ ప్రయాణాన్ని మననం చేసుకున్నారు.

పేద రైతుల సమస్యకు పరిష్కారం


రైతులకు హక్కు పత్రాలు అందజేస్తున్న మంత్రి పువ్వాడ, కలెక్టర్ గౌతమ్

- ఏళ్లుగా పడుతున్న కష్టాన్ని తీర్చాం
- ఇనాం భూముల పట్టాల పంపిణీలో మంత్రి పువ్వాడ

ఖమ్మంఅర్బన్: ఎన్నో ఏళ్లుగా పేద రైతులు ఎదుర్కొంటున్న సమస్యకు పరిష్కారం చూపించామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ వెల్లడించారు. నగరంలోని 15వ డివిజన్ అల్లీపురం రైతు వేదికలో శుక్రవారం ఏర్పాటుచేసిన అల్లీపురం, కొత్తగూడెం గ్రామాలకు చెందిన ఇనాం భూములపై హక్కు పత్రాలను రైతులకు కలెక్టర్ వీ.పీ.గౌతమ్‌తో కలిసి ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 26 ఎకరాల ఇనాం భూములకలిగిన 60 మంది రైతులకు ఆక్యూపెన్సీ సర్టిఫికెట్ పట్టాలను పంపిణీ చేశామని తెలిపారు. తద్వారా దళితులు ఏళ్లుగా ఎదుర్కొంటున్న ఇనాం భూముల హక్కులకు శాశ్వత పరిష్కారం లభించిందని చెప్పారు. స్థానిక అధికారుల ప్రత్యేక చొరవతో పట్టాలు పంపిణీ చేయడం సాధ్యమైందని తెలిపారు. ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్ మధుసూదన్, కేఎంసీ కమిషనర్ ఆదర్శసురభి, మేయర్ పునుకొల్లు నీరజ, కార్పొరేటర్లు కమర్తపు మురళి, రావూరి కరుణ సైదబాబు, ఆర్డీఓ రవీంద్రనాథ్, డీఎంహెచ్‌ఓ మాలతి, తహసీల్దార్ శైలజ, నాయకులు సంక్రాంతి నాగేశ్వరరావు, పగడాల మల్లేష్, మొగ్రిమేకల కోటయ్య, నల్లి గోపాల్, జొన్నలగడ్డ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అల్లీపురంలో కంటి వెలుగు కేంద్రాన్నిమంత్రి, కలెక్టర్ ప్రారంభించారు.

పేదలకు సొంతింటి కల నెరవేర్చేలా..
ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న పేదలకు లబ్ధి జరిగేలా 58, 59 జీఓల ద్వారా పట్టాలు ఇస్తుండమే కాక దరఖాస్తుకు ఇంకో నెల గడువు పొడిగించిందని మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు.


సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ
ఖమ్మంమయూరిసెంటర్: అనారోగ్య సమస్యలతో ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్న వారికి మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ శుక్రవారం అందజేశారు. నగరంలోని క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో మంత్రి మాట్లాడుతూ 262 మందికి గాను రూ.1.01 కోట్ల విలువైన చెక్కులు అందజేయడం ఆనందంగా ఉందని తెలిపారు. కార్పొరేటర్ కమర్తపు మురళి, సుడా చైర్మన్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలోని 8, 14, 15వ డివిజన్ల పరిధిలో లబ్ధిదారులకు ఆయన ఇళ్ల పట్టాలు అందజేసి మాట్లాడారు. ఈసందర్భంగా బీఆర్‌ఎస్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు సురేష్ ఆధ్వర్యాన నిర్మించిన ఆర్చిని ప్రారంభించారు. మేయర్ పునుకొల్లు నీరజ, కార్పొరేటర్లు రావూరి కరుణ, కూరాకుల వలరాజ్, దేవబక్తుని కిషోర్‌బాబుతో పాటు గొల్లపూడి రాంప్రసాద్, గొల్లపూడి హరికృష్ణ, వాంకుడోత్ సురేష్, అశోక్ పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

మూడో రోజుకు చేరిన బ్రహ్మోత్సవాలు


శ్రీవారి పాదాలకు అభిషేకం చేస్తున్న అర్చకులు

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా పేరున్న జమలాపురంలోని శ్రీవేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాలు శుక్రవారం మూడో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా శ్రీవారికి అర్చకులు సుప్రభాత సేవ, శ్రీస్వామి వారి పాదానికి పంచామృతాలతో అభిషేకం చేయడంతో పాటు స్వామి, అమ్మవార్లను అలంకరించి కలశాలకు పూజ చేశారు. ఆతర్వాత శ్రీఅలివేలు మంగ అమ్మవారి ఆలయంలో మహిళలు సామూహిక కుంకుమార్చన, పుష్పార్చన పూజలు నిర్వహించారు. అలాగే,గజ వాహనంపై శ్రీవారు, అమ్మవార్లతో ఆలయ గిరి ప్రదక్షణ చేశారు. వంశపారంపర్య ధర్మకర్తలు ఉప్పల కృష్ణమోహన్‌శర్మ, ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ప్రధాన అర్చకుడు ఉప్పల శ్రీనివాసశర్మ, ఉద్యోగులు, అర్చకులు శ్రీనివాస్, విజయకుమారి, విజయదేవశర్మ, మురళీమోహన్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో కేంద్రబృందం పరిశీలన


పీహెచ్‌సీలో పరిశీలిస్తున్న బృందం సభ్యులు

ఏన్కూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆరోగ్యకేంద్రాన్ని నేషనల్ క్యాలిటీ కంట్రోల్ అస్యూరెన్స్ స్టాండర్డ్(ఎన్‌క్యూఏఎస్) కేంద్ర బృందం శుక్రవారం పరిశీలించింది. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని అన్ని విభాగాలను తనిఖీ చేసిన బృందం సభ్యులు, చికిత్స, మందులు, ఆస్పత్రిలో సౌకర్యాలపై ఆరా తీశారు. అలాగే, రికార్డులను పరిశీలించాక వైద్యులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. కేంద్రబృందంలో డాక్టర్ రతన్‌బాలచంద్రన్, డాక్టర్ సంధ్యపాపానిజా, టి.ఉపేందర్ ఉండగా.. పీహెచ్‌సీ వైద్యులు రాములు, అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఏప్రిల్ 25 నుంచి ఓపెన్ స్కూల్ పరీక్షలు

ఖమ్మం సహకారనగర్/కొత్తగూడెం అర్బన్: తెలంగాణ ఓపెన్ స్కూల్ పరిధిలో పదో తరగతి, ఇంటర్‌మీడియట్ వార్షిక పరీక్షలు ఏప్రిల్ 25నుంచి జరగనున్నాయని డీఈఓ సోమశేఖర శర్మ, ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ మద్దినేని పాపారావు తెలిపారు. పదో తరగతి, ఇంటర్ థియరీ పరీక్షలు ఏప్రిల్ 25నుంచి మే 4వ తేదీ వరకు, ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు మే 12నుంచి 19వ తేదీ వరకు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

'గిరి వికాసం' లక్ష్యాలపై ప్రత్యేక దృష్టి

- కలెక్టర్ వీ.పీ.గౌతమ్
- ఐటీడీఏ పీఓ, అధికారులతో సమీక్ష

ఖమ్మం సహకారనగర్: గిరిజనుల అభ్యున్నతికి చేపట్టిన గిరివికాసం పథకం లక్ష్యాలు వంద శాతం పూర్తయ్యేలా దృష్టి సారించాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సూచించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఆయన భద్రాచలం ఐటీడీఏ పీఓ గౌతమ్ పొట్రుతో కలిసి గిరివికాసంపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పథకం కింద 809 బ్లాక్‌లను గుర్తించామని తెలిపారు. కొన్నిచోట్ల బోర్లు వేసేందుకు అనుమతులు ఇచ్చినందున, అటవీశాఖ అభ్యంతరాలపై ఆరా తీశారు. అనంతరం ట్రైకార్ పథకం కింద మంజూరైన యూనిట్ల గ్రౌండింగ్‌పై చర్చిస్తూ గిరిజన యువత స్వయం ఉపాధి కోసం మంజూరు చేస్తున్న యూనిట్ల గ్రౌండింగ్‌లో వేగం పెంచాలని తెలిపారు.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయండి
జిల్లాలో మన ఊరు– మనబడి, మన బస్తీ –మన బడి ద్వారా మొదటి విడతగా ఎంపిక చేసిన 426 పాఠశాలల్లో పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ గౌతమ్ సూచించారు. కలెక్టరేట్‌లో ఆయన వివిధ ఇంజనీరింగ్ విభాగాల అధికారులతో సమావేశమై మాట్లాడుతూ రూ.30 లక్షలకు పైగా నిధులతో చేపట్టాల్సిన పనులపై టెండర్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. మే 31 లోగా అన్ని పాఠశాలల్లో పనులు పూర్తికావాల్సిందేనని స్పష్టం చేశారు.

ప్రణాళికాయుతంగా లక్ష్యసాధన
ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు ప్రభుత్వం నిర్దేశించుకున్న లక్ష్యాలను ప్రణాళికాయుతంగా పూర్తి చేసేలా అధికారులు కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సూచించారు. హైదరాబాద్ నుండి శుక్రవారం ఆమె కంటి వెలుగు, ఆరోగ్య మహిళ, డబుల్ బెడ్‌రూం ఇళ్లు, 58, 59 జీఓలు, పోడుభూములు, హరితహారం, పదో తరగతి పరీక్షల నిర్వహణపై వీసీ ద్వారా సమీక్షించి పలు సూచనలు చేశారు. ఈసమావేశాల్లో అదనపు కలెక్టర్లు స్నేహలత, ఎస్.మధుసూదన్, అసిస్టెంట్ కలెక్టర్ రాధిక గుప్తా, డీఎఫ్‌ఓ సిద్దార్థ్ విక్రమ్‌సింగ్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, డీఆర్డీఓ విద్యాచందన, డీడబ్ల్యూఓ కృష్ణనాయక్, ఆర్డీఓలు రవీంద్రనాథ్, సూర్యనారాయణ, ఎల్‌డీఎం శ్రీనివాసరెడ్డి, డీఏఓ విజయనిర్మల, డీఆర్వో శిరీష, డీఎంహెచ్‌ఓ మాలతి, జెడ్పీ సీఈఓ వీ.వీ.అప్పారావు, ఏఎంఓ రామకృష్ణ, ఎఫ్‌డీఓ ప్రకాశరావుతో పాటు జెడ్పీటీసీలు ఎం.ప్రియాంక, బి.బుజ్జి, వి.జగన్ తదితరులు పాల్గొన్నారు.


సమీక్ష మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్, పక్కన ఐటీడీఏ పీఓ గౌతమ్, అధికారులు

పోషకాహారంతోనే ఆరోగ్యం

చింతకాని/బోనకల్: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, పిల్లలకు పోషకాహారాన్ని అందించడం వారు ఆరోగ్యం ఉండేందుకు కృషి చేయాలని జిల్లా సంక్షేమాధికారి సంధ్యారాణి సూచించారు. పోషణ పక్వాడా కార్యక్రమంలో భాగంగా చింతకాని మండలంలోని గాంధీనగర్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం గర్భిణులకు సీమంతాలు, పిల్లలకు అక్షరాభ్యాసం, అన్నప్రాసన చేయగా సంధ్యారాణి ముఖ్యఅతిథిగా మాట్లాడారు. పిల్లల్లో రక్తహీనత అరికట్టేలా పోషకాహారం ఆవశ్యకతపై అవగాహన కల్పించాలని తెలిపారు. సర్పంచ్ కాలంగి లలిత, ఎంపీపీ కోపూరి పూర్ణయ్య, ఎంపీడీఓ శ్రీనివాసరావు, తహసీల్దార్ మంగీలాల్, మండల వైద్యాధికారి వెంకటేశ్వర్లు, ఎంపీఓ మల్లెల రవీంద్రప్రసాద్, ఐసీడీఎస్ సీడీపీఓ సరస్వతి, ఏసీడీపీఓ శివమ్మ, సూపర్‌వైజర్లు పద్మావతి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు. ఇక బోనకల్ మండలం రామాపురం, బోనకల్, రావినూతల అంగన్‌వాడీ కేంద్రాలను కూడా సందర్శించిన ఆమె సిబ్బంది, లబ్ధిదారులతో మాట్లాడి సూచనలు చేశారు.


గర్భిణులకు సీమంతం నిర్వహిస్తున్న డీడబ్ల్యూఓ సంధ్యారాణి

కొనసాగుతున్న రామాయణ క్రతువు



శ్రీరామాయణ పారాయణం చేస్తున్న రుత్విక్‌లు (ఇన్‌సెట్) హోమం చేస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో పుష్కర సామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవాల్లో భాగంగా యాగశాలలో శ్రీరామాయణ క్రతువు కొనసాగుతోంది. శుక్రవారం ఉదయం స్వామివారి ఉత్సవ మూర్తులను మేళతాళాలు, రుత్విక్‌ల మంత్రోచ్చరణల నడుమ యాగశాలలో కొలువుదీర్చి ప్రత్యేక పూజలు చేశారు. 12 హోమ కుండాలలో శ్రీరామాయణ క్రతువు నిర్వహించారు. ఈ సందర్భంగా రుత్విక్‌లు చతుర్వేద హవనాలు, రామాయణ హవనం చేయగా, మరో వైపున రామషడాక్షరీ, నారాయణ అష్టాక్షరి మంత్రాలను జపించారు. అనంతరం సంక్షేప రామాయణ సామూహిక పారాయణం చేపట్టారు. సాయంత్రం స్వామివారికి తిరువీధి సేవ గావించారు.

క్షయను నిర్మూలిద్దాం..

ఖమ్మం వైద్యవిభాగం: ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈర్యాలీని జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ వరికూటి సుబ్బారావు ప్రారంభించగా పెవిలియన్ గ్రౌండ్ నుండి వైరారోడ్డు మీదుగా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి వరకు కొనసాగింది. అనంతరం పాత కలెక్టరేట్ ఎదుట నర్సింగ్ విద్యార్థినులు, టీబీ సిబ్బంది మానవహారంగా ఏర్పడి క్షయ వ్యాధి అంతానికి ప్రతిజ్ఞ చేశారు. ఆతర్వాత ఏర్పాటుచేసిన సమావేశంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు మెమెంటోలు అందజేశారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ రాంబాబు, ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.వెంకటేశ్వర్లు, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరరావుతో పాటు లక్ష్మణ్‌రావు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీని ప్రారంభిస్తున్న అధికారులు

జిల్లాకు జాతీయస్థాయి అవార్డు
క్షయ వ్యాధి నిర్మూలనలో జిల్లాకు జాతీయస్థాయిలో గుర్తింపు దక్కింది. ప్రపంచ టీబీ దినోత్సవం సందర్భంగా జాతీయ స్థాయిలో శనివారం ప్రకటించిన అవార్డుల్లో జిల్లాకు కాంస్య పథకం లభించింది. మొదటి స్థానంలో నిలిచిన నిజామాబాద్‌కు బంగారు పతకం లభించగా.. ఆ తర్వాత స్థానాల్లో నిలిచిన భద్రాద్రి కొత్తగూడెం, హన్మకొండ జిల్లాలకు వెండి పతకాలు, ఖమ్మంకు కాంస్య పతకాలు ప్రకటించారు. గడిచిన రెండేళ్లలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యాన క్షయ వ్యాధి నివారణ కోసం తీసుకుంటున్న చర్యలతో మంచి ఫలితాలు రావడంతో ఈ అవార్డు ప్రకటించారు.

27న నిధి ఆప్ కే నిఖత్

ఖమ్మం సహకారనగర్: ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్(ఈపీఎఫ్‌ఓ) ఆధ్వర్యాన ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 27 'నిధి ఆప్ కే నిఖత్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ ఎం.డీ. సలీంఖాన్ తెలిపారు. ఖమ్మం జిల్లా వాసులు వారు నగరంలోని పాత మున్సిపల్ కార్యాలయంలో, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వాసులైతే పాల్వంచలోని పాత మున్సిపల్ కార్యాలయంలో ఉదయం 9.30గంటలకు మొదలయ్యే కార్యక్రమంలో పాల్గొని సమస్యలు వెల్లడించవచ్చని పేర్కొన్నారు.

జాతర ఆదాయం రూ.72వేలు

కామేపల్లి(కారేపల్లి): కామేపల్లి మండలం లింగాలలో ఉగాది సందర్భంగా నిర్వహించిన శ్రీకోటమైసమ్మతల్లి జాతరకు హాజరైన భక్తులు సమర్పించిన కానుకలను శుక్రవారం లెక్కించారు. దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఆర్.సమత పర్యవేక్షణలో లెక్కింపు జరగగా హుండీ ద్వారా రూ.72,871, పూజా టికెట్ల ద్వారా రూ.13,346 ఆదాయం వచ్చిందని ఆమె తెలిపారు. ఆలయ చైర్మన్ మల్లెంపాటి శ్రీనివాసరావు, సర్పంచ్ బొడ్డు కాంతమ్మ, అర్చకుడు వెంకటపుల్లయ్య శర్మ, దేవాదాయ శాఖ ఉద్యోగులు శేషయ్య, వరప్రసాద్, పుల్లయ్య పాల్గొన్నారు.

క్లుప్తంగా

బీసీలకు చట్టసభల్లో 50శాతం రిజర్వేషన్లు కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రామ్మూర్తి

ఖమ్మంరూరల్: వెనుకబడిన తరగతుల వారికి రాజకీయంగా చట్టసభల్లో 50శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పిండిప్రోలు రామ్మూర్తి డిమాండ్ చేశారు. మండలంలోని పోలేపల్లిలో శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూబీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్ల కోసం వచ్చేనెల 3, 4వ తేదీల్లో ఢిల్లీలో చేపడుతున్న ఆందోళన కార్యక్రమాలకు పెద్దసంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈసమావేశంలో నాయకులు ఎస్.శ్రీనివాస్, ఆడెపు ఆంజనేయులు, ప్రసాద్, మహేష్, ఆడెపు వెంకటరామయ్య, సత్యం తదితరులు పాల్గొన్నారు.

ఏఐసీసీ నేత రాహుల్‌పై వేటు గర్హనీయం

ఖమ్మంమయూరిసెంటర్: కేంద్రం అకృత్యాలను ప్రశ్నిస్తారనే ఆందోళనతోనే ఏఐసీసీ నేత రాహుల్‌గాంధీపై అనర్హత వేటు వేశారని బీఆర్‌ఎస్ లోక్‌సభా పక్ష నేత, ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ చర్య ద్వారా కేంద్రం ప్రజాస్వామ్యం, రాజ్యాంగ విలువలకు తిలోదకాలు ఇచ్చిందని ఆరోపించారు. కాగా, ఏఐసీసీ అగ్ర నేత రాహుల్‌గాంధీపై అనర్హత వేటు వేయటం ప్రజాస్వామ్యం గొంతు నొక్కే చర్య అని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు.

హైదరాబాద్ ధర్నాకు విద్యుత్ ఉద్యోగులు



హైదరాబాద్ వెళ్తున్న విద్యుత్ ఉద్యోగులు

ఖమ్మంవ్యవసాయం: సమస్యల పరిష్కారం కోసం హైదరాబాద్ విద్యుత్ సౌధ శుక్రవారం వద్ద జరిగిన ధర్నాలో పాల్గొనేందుకు ఖమ్మం నుంచి ఉద్యోగులు తరలివెళ్లారు. ఖమ్మం స్కిల్ ఆపరేషన్ కార్యాలయం నుంచి ఉద్యోగులు, ఇంజనీర్లు బయలుదేరారు. పీఆర్సీ అమలు, ఈపీఎఫ్‌ను జీపీఎఫ్‌గా మార్చడంతో పాటు ఆర్టిజన్ కార్మికులకు కన్వర్షన్ ఇవ్వాలనే తదితర డిమాండ్లతో ధర్నా చేయగా, వివిధ యూనియన్ల నాయకులు కె.హీరాలాల్, టి.శేషగిరిరావు, కె.నాగేశ్వరరావు, ఏ.రవికుమార్, షేక్ దావూద్, ఎం.ప్రసాద్, పుష్పరాణి, వల్లాల యుగేందర్, జీ.వీ.రామారావు, సురేష్, టి.లక్ష్మీనర్సింహారావు, కె.కోటేశ్వరరావు, కె.రాజశేఖర్ పాల్గొన్నారు.

మృతదేహంతో పాల ఫ్యాక్టరీ ఎదుట ఆందోళన



ఉపేందర్ మృతదేహంతో ఆందోళన చేస్తున్న బంధువులు

వైరా: వైరాలోని వైష్ణవి పాల ఫ్యాక్టరీలో వ్యాన్ డ్రైవర్‌గా పనిచేస్తున్న మండలంలోని గరికపాడుకు చెందిన గుమ్మా ఉపేందర్(27) గుండెపోటుతో మృతి చెందాడు. రోజుమాదిరిగానే పాల వ్యాన్‌తో గురువారం సూర్యాపేట బయలుదేరిన ఆయనకు మార్గమధ్యలో గుండెపోటు రావడంతో కన్నుమూశాడు. ఈ విషయం తెలిసినా ఫ్యాక్టరీ యాజమాన్యం స్పందించలేదని ఆరోపిస్తూ ఆయన కుటుంబసభ్యులు, గ్రామస్తులు మృతదేహంతో పాల ఫ్యాక్టరీ గేటు ఎదుట ఆందోళనకు దిగారు. అయినా ఫ్యాక్టరీ తరఫున ఎవరూ మాట్లాడకపోవడంతో మృతదేహాన్ని వైరా - ఖమ్మం రాష్ట్రీయ రహదారిపైకి తీసుకొచ్చి ధర్నా చేపట్టగా.. రెండు గంటల పాటు ఇరువైపులా ట్రాఫిక్ భారీగా నిలిచిపోయింది. వైరా సీఐ తాటిపాముల సురేష్, కొణిజర్ల ఎస్ఐ జె.శంకరరావు చేరుకుని వారికి నచ్చచెప్పగా, ఫ్యాక్టరీ యాజమాన్యం రూ.4 లక్షల ఆర్థిక సాయం ఇచ్చేందుకు అంగీకరించడంతో ఆందోళన విరమించారు. కాగా, ఉపేందర్‌కు భార్య, ఆరు నెలల కుమార్తె ఉన్నారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	7,775	7,100
కందులు	7.850	6,300
మిర్చి	24,000	17,600
మిర్చి తాలు	14,300	9,000
పత్తి	7,302	5,800

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.13,781

కేసీఆర్‌ను మించిన నాయకులు లేరు..

- బీజేపీ, కాంగ్రెస్ నేతలను నడిబజార్‌లో నిలదీయాలి
- బీఆర్‌ఎస్ ఆత్మీయ సభలో ఎమ్మెల్సీ తాతా మధు



సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మధు, పక్కన ఎమ్మెల్యే రాములునాయక్ తదితరులు

కారేపల్లి: కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నాం, ఆయనను మించి ఈ రాష్ట్రంలో నాయకులెవరూ లేరని.. బీజేపీ, కాంగ్రెస్ నాయకులు మాయమాటలతో వస్తే నడిబజార్‌లో నిలదీయాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు సూచించారు. మండలంలోని పేరుపల్లిలో ఏర్పాటుచేసిన ముఖ్యకార్యకర్తల ఆత్మీయ సమ్మేళనానికి మండల అధ్యక్షుడు పెద్దబోయిన ఉమాశంకర్ అధ్యక్షత వహించగా.. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ మధు, వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రంలో ప్రతి పల్లె సర్వతోముఖాభివృద్ధి సాధిస్తుందన్నారు. మోదీ ప్రభుత్వం గ్యాస్, పెట్రోల్ ధరలు పెంచి సామాన్యుల పై మోయలేని భారాన్ని మోపిందని ఆరోపించారు. ఎంపీపీ మాలోతు శకుంతల, వైస్ ఎంపీపీ రావూరి శ్రీనివాసరావుతో పాటు ఇస్లావత్ బన్సిలాల్, ముత్యాల సత్యనారాయణ, అజ్మీర వీరన్న, అడ్డగోడ ఐలయ్య, నర్సింగ్ శ్రీనివాసరావు, పిల్లి వెంకటేశ్వర్లు, భూక్యా రంగారావు, ధరావత్ పాండ్యా నాయక్, అజ్మీరా నాగేశ్వరరావు, పిల్లలమర్రి స్వర్ణ వీరన్న, బానోతు పద్మామోహన్, మంగమ్మ, సక్రు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల పక్షపాతి ముఖ్యమంత్రి కేసీఆర్

ఖమ్మం వైరారోడ్ : సీఎం కేసీఆర్ రైతుల పక్షపాతి అని టీఆర్‌ఎస్ నేతలు కొనియాడారు. అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.10 వేల చొప్పున పరిహారం ప్రకటించగా.. ఖమ్మంలోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో ఎమ్మెల్సీ, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్, జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ మాట్లాడారు. రైతు సంక్షేమ ప్రతినిధిగా కేసీఆర్ చిరస్థాయిగా నిలిచిపోతారని తెలిపారు. అయితే, పంట నష్టంపై కేసీఆర్ స్పందించిన తీరును ప్రతిపక్షాలు జీర్ణించుకోలేకపోతున్నాయని ఎద్దేవా చేశారు. ఈ సమావేశంలో రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు నల్లమల వెంకటేశ్వర్లు, నాయకులు చింతనిప్పు కృష్ణ చైతన్య, డోకుపర్తి సుబ్బారావు, శీను, మల్లయ్య పాల్గొన్నారు.

మా కృషితోనే పరిహారం

- బీజేపీని గద్దె దించడమే లక్ష్యంగా బీఆర్‌ఎస్‌తో జట్టు
- జనచైతన్య యాత్రలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



సభలో మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం

ఖమ్మంరూరల్/తిరుమలాయపాలెం/కూసుమంచి/ముదిగొండ: మతతత్వ విధానాలను దేశాన్ని అధోగతి పాలుచేస్తున్న బీజేపీని నిలువరించేందుకు బీఆర్‌ఎస్‌తో జట్టు కట్టామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం వెల్లడించారు. సీపీఎం ఆధ్వర్యాన చేపట్టిన జనచైతన్య యాత్ర శుక్రవారం ఖమ్మం తిరుమలాయపాలెం, కూసుమంచి, ఖమ్మం రూరల్, ముదిగొండ మండలాల్లో కొనసాగింది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభల్లో తమ్మినేని మాట్లాడుతూ బీఆర్‌ఎస్‌తో జట్టు కట్టే సమయాన ప్రజల సమస్యలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లడంతో పరిష్కారంపై సానుకూలంగా స్పందించారని తెలిపారు. కాగా, మునుగోడులో సీపీఎం, సీపీఐ పార్టీలు బీఆర్‌ఎస్‌కు మద్దతు ఇవ్వడం ద్వారా బీజేపీని నిలువరించామని చెప్పారు. కాగా, సీపీఎం, సీపీఐ పార్టీల చొరవతో పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10వేల పరిహారం ఇచ్చేందుకు సీఎం నిర్ణయించగా కౌలు రైతులకు కూడా న్యాయం జరిగిందని తెలిపారు. కాగా, కూసుమంచిలో జరిగిన సభకు ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి హాజరై సంఘీభావం తెలిపి మాట్లాడారు. ఇక ముదిగొండ సభకు ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ హాజరయ్యారు. సమావేశాల్లో సీపీఎం. సీపీఐ, బీఆర్‌ఎస్ నాయకులు ప్రజాప్రతినిధులు పోతినేని సుదర్శన్‌రావు, బి.వెంకట్, సున్నా నాగేశ్వరరావు, పాలడుగు భాస్కర్, మల్లు లక్ష్మి, బుగ్గవీటి సరళ, మాచర్ల భారతి, ఎర్ర శ్రీకాంత్, బండి రమేష్, ఎర్ర శ్రీనివాసరావు, షేక్ బషీరుద్దీన్‌తో పాటు కొమ్ము శ్రీను, కొండబాల వెంకటేశ్వర్లు, బానోత్ శ్రీనివాస్‌నాయక్, ఇంటూరి శేఖర్, వేముల వీరయ్య, మల్లేష్, నర్సింహానాయక్, ఎడవెల్లి రమణారెడ్డి, గురుమూర్తి, సన్మంతరావు, గంగాధర్, రాజు, పొన్నం వెంకటేశ్వర్లు, బండి రమేష్, బండి పద్మ, పసుపులేటి దుర్గ తదితరులు పాల్గొన్నారు. కాగా, ఖమ్మంరూరల్ మండలం మద్దులపల్లికి చెందిన మాజీ సీపీఎం నాయకుడు నల్లపునేని అప్పారావు తిరిగి వీరభద్రం సమక్షాన సీపీఎంలో చేరారు.

నేడు జిల్లాలో మంత్రి పువ్వాడ పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్/మధిర: రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ శనివారం ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 6.30గంటల నుంచి ఖమ్మం 14వ డివిజన్‌లోని మధురానగర్‌లో వాడవాడకు పువ్వాడ కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం 9.30 గంటలకు కలెక్టరేట్‌లో జరిగే సమావేశంలో మంత్రి పాల్గొని ఉత్తమ సర్పంచ్‌లకు అవార్డులు అందజేస్తారు. సాయంత్రం 4 గంటలకు మధిరలో ట్యాంక్‌బండ్, ఇంటిగ్రేటెడ్ వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్‌ను ప్రారంభించడమే కాక పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు.

నేడు, రేపు ఎంపీ నామా...

ఖమ్మంమయూరిసెంటర్: బీఆర్‌ఎస్ లోక్‌సభా పక్షనేత, ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు శని, ఆదివారం ఉమ్మడి జిల్లాలో పర్యటించనున్నారు. మధిరలో శనివారం పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవం, శంకుస్థాపనకు ఎంపీ హాజరవుతారు. అలాగే, జూలూరుపాడులో జరిగే బీఆర్‌ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమావేశం, నేలకొండపల్లిలో జరిగే సీపీఎం జనచైతన్య యాత్ర బహిరంగ సభలో పాల్గొంటారు. ఇక ఆదివారం ఉదయం ఖమ్మంలోని తన క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేయనున్న ఎంపీ నామా, ఖమ్మం టూటౌన్ కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో పాల్గొని మాట్లాడారు.

'ప్రమాదంలో ప్రజాస్వామ్యం'



మాట్లాడుతున్న హేమంతరావు

ఖమ్మంమయూరిసెంటర్: దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు అన్నారు. ఈమేరకు ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాటానికి సిద్ధం కావాలని కోరారు. ఖమ్మంలోని సీపీఐ కార్యాలయంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ వర్ధంతి సందర్భంగా అమర వీరుల ఆశయాలు – మన కర్తవ్యం అంశంపై ఖమ్మం స్టడీ సర్కిల్ ఆధ్వర్యాన శుక్రవారం ఏర్పాటుచేసిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. స్వాతంత్య్ర పోరాటంలో ఎందరో తృణ ప్రాయంగా ప్రాణాలు అర్పించారని.. అందులో అగ్రగణ్యులు భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్ అని తెలిపారు. కాగా, ప్రస్తుత సామాజిక పరిస్థితులు, ప్రభుత్వ విధానాలపై దీర్ఘకాలిక ప్రజా ఉద్యమాలకు యువత సిద్ధం కావాలన్నారు. ఈసమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, నాయకులు సిద్దినేని కర్ణకుమార్, జమ్ముల జితేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శాలువాలు కాదు.. బాధలు తీర్చండి



మాట్లాడుతున్న సర్పంచ్ పుల్లయ్య

నేలకొండపల్లి: శాలువలు కప్పినంత మాత్రానా సర్పంచ్‌ల బాధలు పోతాయా అని రాజేశ్వరపురం సర్పంచ్ దండా పుల్లయ్య ఆవేదన వ్యక్తం చేశారు. నేలకొండపల్లి మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సర్పంచ్‌లకు జాతీయ పంచాయతీ అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనులు చేయకపోతే సర్పంచ్‌లను సస్పెండ్ చేస్తామని చెప్పిన అధికారులు బిల్లుల విషయంలో ఎందుకు స్పందించటం లేదని ప్రశ్నించారు. అప్పులు తెచ్చి పనులు చేస్తే ఏడాదిగా బిల్లులు రాక ఇబ్బంది పడుతున్నామని, కరెంట్ బిల్లులు, సిబ్బంది వేతనాలకు అప్పులు కూడా పుట్టడం లేదని తెలిపారు. ఇకనైనా అధికారులు సన్మానాలు కాకుండా సమస్యలు పరిష్కరించాలని కోరారు. జెడ్పీ వైస్ చైర్మన్ మరికంటి ధనలక్ష్మి, ఎంపీపీ వజ్జా రమ్య, ఎంపీడీఓ కె.జమలారెడ్డి, తహసీల్దార్ దారా ప్రసాద్, ఎంపీఓ శివ తదితరులు పాల్గొన్నారు.

విజయ డెయిరీ షాపింగ్ కాంప్లెక్స్‌కు టెండర్లు

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మంలోని ప్రభుత్వ పాడి పరిశ్రమ(విజయ డెయిరీ) ప్రాంగణంలో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌లో షాపులు అద్దెకు ఇచ్చేందుకు త్వరలోనే టెండర్లు నిర్వహించనున్నారు. నగరంలోని ప్రధాన రహదారి వెంట రూ.45.88లక్షల వ్యయంతో పది షాపులతో కూడిన కాంప్లెక్స్ నిర్మాణం గత ఏడాది జూన్‌లో పూర్తయింది. అయినా అద్దెకు ఇవ్వకపోవడంతో ఆదాయం కోల్పోతుంది. ఈ నేపథ్యాన ఓ కమిటీని ఏర్పాటు చేసి షాపులు అద్దెకు ఇవ్వాలని ఉన్నతాధికారులు డీడీ కుమారస్వామిని ఆదేశించారు. దీంతో త్వరలోనే ఉన్నతాధికారులతో కమిటీ ఏర్పాటుచేసి టెండర్ ప్రక్రియ ద్వారా కాంప్లెక్స్‌లోని గదులను అద్దెకు ఇచ్చేందుకు కసరత్తుచేపట్టారు.

బార్ అసోసియేషన్‌లో నలుగురి ఏకగ్రీవం



ఏకగ్రీవంగా ఎన్నికైన లక్ష్మీనారాయణ, అమర్‌నాథ్, జ్యోతిప్రవీణ్‌కుమార్, లక్ష్మి

ఖమ్మం లీగల్: ఖమ్మం బార్ అసోసియషన్ ఎన్నికలు ఈనెల 31న జరగనుండగా, నామినేషన్ల దాఖలు గడువు శుక్రవారంతో ముగిసింది. ఈసందర్భంగా అధ్యక్ష పదవికి మల్లెంపాటి అప్పారావు, దిరిశాల కృష్ణారావు, నేరళ్ల శ్రీనివాసరావు, ఆర్.సుధీర్ సింగ్, సీ.హెచ్.స్వర్ణకుమారి, ఎం.ఏ.తౌఫిక్ తమ నామినేషన్లను ఎన్నికల అధికారి ఎస్.సోమశేఖరశర్మకు అందజేశారు. అలాగే, కార్యదర్శి పదవికి మన్నేపల్లి బసవయ్య, చింతనిప్పు వెంకటేశ్వరరావు, సంయుక్త కార్యదర్శిగా కండె వెంకటేశ్వరరావు, అయ్యదేవర విజయ రాఘవ, క్రీడా కార్యదర్శి పదవికి పెరుమాళ్లపల్లి జానయ్య, రావుల వెంకట్ నామినేషన్లు సమర్పించారు. కాగా, బార్ అసోసియేషన్‌లో నాలుగు పదవులకు ఒక్కో నామినేషన్ మాత్రమే రావడంతో ఆయా పదవులు ఏకగ్రీవమైనట్లుగా ప్రకటించారు. ఈమేరకు వైస్ ప్రెసిడెంట్‌గా మాదిరాజు లక్ష్మీనారాయణ, గ్రంథాలయ కార్యదర్శిగా గాజుల అమరనాథ్, కోశాధికారిగా మిరియాల జ్యోతి ప్రవీణ్‌కుమార్, మహిళా ప్రతినిధిగా కే.వీ.వీ.లక్ష్మి ఎన్నికైన వారిలో ఉన్నారు.

కలెక్టరేట్ ఎదుట ఉపాధ్యాయుల నిరసన



నిరసనలో పాల్గొన్న ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు

ఖమ్మం సహకారనగర్: ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు, ఎయిడెడ్ ఉపాధ్యాయుల వేతనాలు చెల్లించాలనే డిమాండ్‌తో ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ(యూఎస్‌పీసీ) ఆధ్వర్యాన శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూఎస్‌పీసీ బాధ్యులు పి.నాగిరెడ్డి, మహబూబ్ తదితరులు మాట్లాడుతూ బడ్జెట్ ఉన్నా మూడు నెలలుగా ఎయిడెడ్ టీచర్లకు వేతనాలు ఇవ్వకపోవడం సరికాదన్నారు. ఇకనైనా ఈఎల్స్ బిల్లులు, సప్లమెంటరీ వేతనాలు, సెలవుల జీతాలు, జీపీఎఫ్ క్లైయిమ్‌లు, మెడికల్ రీయింబర్స్‌మెంట్, పెన్షన్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. త్వరలోనే ఆర్థిక సంవత్సరం ముగియనున్న నేపథ్యాన స్పందించాలని కోరుతూ ట్రెజరీ డీడీ వెంటపల్లి సత్యనారాయణకు వినతిపత్రం సమర్పించారు. వివిధ ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు వడ్డె వెంకటేశ్వరరావు, ఎస్.విజయ్, జీ.వీ.నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావు, మన్సూర్, యాదగిరి, హుస్సేన్, రామకృష్ణ, బన్సీలాల్, ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలోనే పెద్దసంఘంగా రైతులకు సేవలు

ఖమ్మంఅర్బన్: ఖమ్మంలోని టేకులపల్లి ఆంధ్రాబ్యాంక్ కర్షక సేవా సంఘం జిల్లాలోనే అతిపెద్ద సొసైటీగా రైతులకు సేవలందిస్తోందని జిల్లా సహకార శాఖ అధికారి విజయకుమారి కొనియాడారు. సహకార సంఘం 52వ మహాజన సభ శుక్రవారం ఏర్పాటుచేయగా ఆమె ముఖ్యఅతిథిగా మాట్లాడారు. సంఘం రూ.10కోట్లు అదనపు టర్నోవర్ చేసి జిల్లాలోనే రూ.40 కోట్లు టర్నోవర్ చేసిన సొసైటీల్లో మొదటి స్థానం దక్కించుకుందని చెప్పారు. సంఘానికి మంజూరైన కోల్డ్‌స్టోరేజీ నిర్మాణం పూర్తయితే రాష్ట్రంలోనే మంచి పేరు వస్తుందని చెప్పారు. సంఘం చైర్మన్ బీరెడ్డి నాగచంద్రారెడ్డి మాట్లాడుతూ రైతులు ప్రైవేట్ బ్యాంకులను ఆశ్రయించకుండా సొసైటీల ద్వారా సేవలు పొందాలని సూచించారు. అనంతరం సొసైటీ ద్వారా ఇద్దరు రైతులకు మంజూరైన ట్రాక్టర్లను అందజేశారు. సొసైటీ మేనేజింగ్ డైరెక్టర్ రమేష్, కార్పొరేటర్ చిరుమామిళ్ల లక్ష్మీనాగేశ్వరరావు, బ్యాంక్ ఎండీ సాకేత్ కుమార్, డైరెక్టర్లు వాకదాని రాంనారాయణ, కుర్రా భాస్కర్రావు, రావెళ్ల కిషన్, మన్నెపల్లి రవి, చావా వాణిశ్రీ, ఇనప రాంబాబు, కోటమర్తి నాగమణి, లింగా నాగార్జున, పొన్నం వెంకటరమణ, సీఈఓ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు ఏర్పాట్లు చేయండి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మధుసూదన్

ఖమ్మం సహకారనగర్: రబీ సీజన్‌లో రైతులు పండించిన ధాన్యం కొనుగోలు చేసేందుకు ముందస్తు ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ ఏ.మధుసూదన్ సూచించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఆయన పౌరసరఫరాలు, జిల్లా గ్రామీణాభివృద్ధి, మార్కెటింగ్, సహకారశాఖ అధికారులతో సమావేశమై ధాన్యంకొనుగోళ్లపై చర్చించారు. జిల్లాలో 4లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలనేది లక్ష్యం కాగా, 234 కేంద్రాలు ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. అన్ని కేంద్రాల్లో షామియానా, తాగునీరు, విద్యుత్ సౌకర్యంతో పాటు తగినన్ని టార్పాలిన్లు, పాడీ క్లీనర్లు సమకూర్చాలని సూచించారు. జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి రాజేందర్, డీఎం సోములు, ఏఎంటీ నర్సింహారావు, డీసీఓ విజయకుమారి, డీసీఎంఎస్ బ్రాంచ్ మేనేజర్ సందీప్, లీగల్ మెట్రాలజీ అధికారి ఉమారాణి, డీఆర్డీఓ విద్యాచందన, ఆర్టీఓ కిషన్‌రావు పాల్గొన్నారు.

పొలంలోనే అన్నదాత కన్నుమూత

నేలవాలిన పంటను చూసి గుండెపోటుతో మృతి



వంగల కృష్ణ (ఫైల్)

బోనకల్: పొలాన్ని చూడడానికి వెళ్లిన రైతు మొక్కజొన్న చేను వద్ద గుండెపోటుతో కన్నుమూశాడు. బోనకల్ మండలం బ్రాహ్మణపల్లికి చెందిన వంగల కృష్ణ(55) తనకు ఉన్న ఆరు ఎకరాలతో పాటు మరో నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకొని మొక్కజొన్న, మిర్చి, వరి వేశాడు. అయితే, మొక్కజొన్న చేతికి వచ్చే సమయాన అకాల వర్షానికి నేలమట్టం కావడంతో రూ.2.50లక్షల మేర పెట్టుబడి వచ్చే పరిస్థితి కనిపించలేదు. ఈక్రమంలోనే శుక్రవారం మొక్కజొన్న చేను వద్దకు వెళ్లిన ఆయనకు అక్కడకు గుండెపోటు రావడంతో ఒక్కసారిగా కేక వేస్తూ కుప్పకూలాడు. దీంతో సమీప రైతులు చేరుకుని ఆయనను మధిర తీసుకెళ్లేలోగా మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు. కృష్ణకు భార్యతో పాటు ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు.

ఐదేళ్ల తర్వాత కుటుంబం చెంతకు..



అర్జున్‌ను కుటుంబానికి అప్పగిస్తున్న పోలీసులు, అన్నం ఫౌండేషన్ బాధ్యులు

ఖమ్మంఅర్బన్: ఐదేళ్ల క్రితం మతిస్థిమితం కోల్పోయిన ఇంటి నుంచి వెళ్లిపోయిన వ్యక్తి మళ్లీ కళ్ల ముందుకు కనిపించడంతో ఆ కుటుంబీకుల ఆనందానికి అంతు లేకుండా పోయింది. వివరాల్లోకి వెళ్తే.. నాలుగేళ్ల క్రితం దివ్యాంగుడైన వ్యక్తి హైదరాబాద్ నుండి సూర్యాపేట వైపు నడిచి వస్తుండగా అన్నం ఫౌండేషన్ సభ్యులు గుర్తించి ఖమ్మంలోని ఆశ్రమానికి తీసుకొచ్చారు. ఇక్కడే ఆశ్రయం కల్పించి బాగోగులు చూడగా కొన్నాళ్లకు కోలుకున్నాడు. దీంతో వివరాలు ఆరా తీయగా తాను ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో కుకనూర్‌కు చెందిన అర్జున్‌గా చెప్పడంతో పాటు తల్లిదండ్రుల సమాచారం ఇచ్చాడు. దీంతో అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు భద్రాద్రి జిల్లా పోలీసుల సాయంతో ఛత్తీస్‌గఢ్ పోలీసులను సంప్రదించగా అర్జున్ కుటుంబం ఆచూకీ గుర్తించారు. ఈమేరకు శ్రీనివాసరావు అంబులెన్స్‌లో అర్జున్‌ను తీసుకుని శుక్రవారం వెళ్లి అక్కడ పోలీసులకు అప్పగించగా వారు అర్జున్‌ను సోదరుడు బబ్లూ చెంతకు చేర్చారు. దీంతో వారు మాట్లాడుతూ అర్జున్ కనిపించడం లేదనే బాధతో ఆయన తల్లి మృతి చెందినట్లు చెప్పారు. కాగా, ఆయనను చేరదీసిన అన్నం శ్రీనివాసరావు, సభ్యులను కుకనార్ సీఐ శశికాంత్ సిన్హా అభినందించారు

రెడ్‌క్రాస్ సొసైటీ ఎన్నిక ఏకగ్రీవం

ఖమ్మంవ్యవసాయం: ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా బ్రాంచి కమిటీ ఏకగ్రీవమైంది. ఖమ్మం బ్రాంచిలో 749 మంది సభ్యులు ఉండగా, 15 మందితో సొసైటీ కార్యవర్గం ఎన్నికకు నోటిఫికేషన్ విడుదల చేశారు. అయితే, 15 మందే నామినేషన్లు వేయడంతో అందరూ ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారి విజయకుమారి శుక్రవారం ప్రకటించారు. దీంతో శనివారం ఆఫీస్ బేరర్ల పదవులకు ఎన్నిక నిర్వహించనున్నారు.

భర్త వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య



శ్రావ్య (ఫైల్)

తల్లాడ: మండలంలోని నారాయణపురానికి చెందిన వివాహిత భర్త వేధింపులు తాళలేక ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన పాట్టేటి శ్రావ్య(22)కు ఖమ్మంకు చెందిన పవన్ కృష్ణారెడ్డితో మూడేళ్ల క్రితం వివాహమైంది. కాగా, కృష్ణారెడ్డి తల్లిదండ్రులు ఖమ్మంలో ఉంటుండగా, ఆయన భార్యతో కలిసి కర్ణాటక రాష్ట్రం రాయచూర్‌లో ఉంటూ కెనరా బ్యాంక్ మేనేజర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. అయితే, భర్త వేధింపులు తాళలేక శ్రావ్య ఆరు నెలల క్రితం నారాయణపురం వచ్చి పుట్టింట్లో ఉంటుంది. విడాకుల కోసం ఇద్దరూ కోర్టును ఆశ్రయించగా, కృష్ణారెడ్డిపై తల్లాడ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. అయినప్పటికీ వేధింపులు ఆగకపోవడంతో ఆమె మనస్తాపం చెంది ఇంట్లో శుక్రవారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ మేరకు వైరా ఏసీపీ రెహమాన్, ఎస్ఐ సురేష్ పరిశీలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

అది దొంగల రాజ్యం...

ఆధారాలతో చంద్రబాబు మరో భారీ దోపిడీ బట్టబయలు
శాసనసభలో సీఎం వైఎస్ జగన్ వెల్లడి

సాక్షి, అమరావతి : 'అమరావతిలో సచివాలయం, శాసనసభ, న్యాయస్థానం భవన నిర్మాణాల్లో చంద్రబాబు యథేచ్ఛగా దోపిడీకి పాల్పడ్డారు. కాంట్రాక్టు సంస్థలను బెదిరించి మరీ భారీ వసూళ్లు చేశారు. తన మనుషుల ద్వారా బోగస్ కంపెనీలు సృష్టించి సబ్ కాంట్రాక్టుల రూపంలో నిధులు కొల్లగొట్టారు' అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. 'ఇది మనం చెబుతోంది కాదు. ఆదాయ పన్ను శాఖ అధికారుల సోదాల్లో బట్టబయలైన అవినీతి బాగోతం. ఐటీ శాఖ అప్రైజల్ రిపోర్ట్ వెల్లడించిన వాస్తవం' అని వెల్లడించారు. 'అమరావతిలో భవన నిర్మాణ కాంట్రాక్టు కంపెనీలపై ఐటీ అధికారులు దాడులు నిర్వహిస్తే ఈ అవినీతి బండారం బయట పడింది. అందుకే చంద్రబాబుకు ఐటీ శాఖ నోటీసులు ఇచ్చింది' అని తెలిపారు. అమరావతి నిర్మాణాల విషయంలో చంద్రబాబు అవినీతిపై ఐటీ శాఖ నోటీసులు జారీ చేసిన అంశంపై శాసనసభలో శుక్రవారం నిర్వహించిన చర్చలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగించారు. 'చంద్రబాబు తమను బెదిరించడంతోనే ఆయన చెప్పిన బోగస్ కంపెనీలకు నిధులు మళ్లించామని షాపూర్జీ-పల్లోంజీ కంపెనీ ప్రతినిధులు ఐటీ శాఖకు ఇచ్చిన వాంగ్మూలంలో అంగీకరించారు. మరో నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టీ కంపెనీ నుంచి తామే నిధులు వసూలు చేసి, చంద్రబాబుకు అందించామని వెల్లడించార'ని సభ దృష్టికి తీసుకువచ్చారు. ఈ వ్యవహారంలో చంద్రబాబు నిధులను కొల్లగొట్టిన తీరును ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఇలా వివరించారు.


GOVERNMENT OF INDIA
MINISTRY OF FINANCE
INCOME TAX DEPARTMENT

చంద్రబాబుకు ఐటీ శాఖ ఇచ్చిన నోటీసులు

● ఐటీ దాడులతో వెలుగులోకి..

- మొట్టమొదటగా ఆదాయ పన్ను శాఖ (ఐటీ శాఖ) అధికారులు షాపూర్‌జీ పల్లోంజీ కంపెనీ ప్రతినిధి మనోజ్ వాసుదేవ్ నివాసంలో 2019 నవంబర్‌లో సోదాలు నిర్వహించారు. అక్కడ మొత్తం సమాచారం లభించింది. ఆ తర్వాత 2020 ఫిబ్రవరిలో చంద్రబాబు పీఏ శ్రీనివాస్ నివాసంలో సోదాలు చేశారు. దాంతో మరింత సమాచారం లభించింది.
- ఆదాయ పన్ను శాఖ పరిశోధన విభాగం ఆ మొత్తం సమాచారాన్ని క్రోడీకరించి ఆదాయ పన్ను అప్రైజల్ రిపోర్ట్‌ను తయారు చేసింది. తాము నిర్వహించిన దాడుల్లో లభించిన ఆధారాల ప్రకారం సంబంధిత వ్యక్తులను పిలిపించారు. తాము సేకరించిన ఆధారాలను ఆ వ్యక్తులకు చూపించి వారి వాంగ్మూలాలు నమోదు చేశారు. ఆ వాంగ్మూలాలపై వారు సంతకాలు కూడా పెట్టారు. వాటన్నింటి ఆధారంగా ఐటీ అధికారులు చంద్రబాబుకు ఇప్పుడు నోటీసులు పంపారు.

● చంద్రబాబు అవినీతి బాగోతం ఇలా..

- అమరావతిలో నిర్మాణాల కంట్రాక్టుల్లో చంద్రబాబు భారీగా అవినీతికి పాల్పడ్డారు. అందుకోసం పక్కాగా స్కెచ్ వేశారు. 2019 జనవరి, ఫిబ్రవరిలో చంద్రబాబు షాపూర్‌జీ పల్లోంజీ కంపెనీ ప్రతినిధి మనోజ్ వాసుదేవ్‌ను పిలిపించుకుని తన పీఏ శ్రీనివాస్‌ను కలవమని చెప్పారు. దాంతో మనోజ్.. చంద్రబాబు పీఏ శ్రీనివాస్‌ను కలిశారు.
- షాపూర్జీ పల్లోంజీ కంపెనీ కర్నూలు, గుంటూరు, అనంతపురం, పశ్చిమగోదారిల్లో టిడ్కో ఇళ్లు, అమరావతిలో హైకోర్టు, అసెంబ్లీ, సచివాలయం తాత్కాలిక భవనాల నిర్మాణంతోపాటు రాజధానిలో ఇతర నిర్మాణ పనులను కలిపి 2018 నాటికి రూ.8 వేల కోట్ల విలువ చేసే కాంట్రాక్ట్ పనులు చేసింది. అందులో తన కమీషన్లు వసూలు చేసేందుకు బాబు.. శ్రీనివాస్‌ను రంగంలోకి దింపారు. వినయ్ నంగల్లా, విక్కీ జైన్ అనే ఇద్దరిని మనోజ్‌కు శ్రీనివాస్ అటాచ్ చేశారు. వీరిలో వినయ్ నంగల్లా మూడు కంపెనీలు, విక్కీ జైన్ రెండు కంపెనీలు సృష్టించారు. ఆ కంపెనీలకు బోగస్ సబ్ కాంట్రాక్టుల కింద డబ్బులు ఇవ్వమన్నారు. వాళ్ల నుంచి తాము డబ్బులు తీసుకుంటామని చంద్రబాబు పీఏ శ్రీనివాస్ మనోజ్‌తో చెప్పారు.
- దాంతో వినయ్ నంగల్లా హయగ్రీవమ్, అన్నై షలాఖా అనే కంపెనీలను మనోజ్‌కు అటాచ్ చేశారు. విక్కీ జైన్.. నయోలిన్, ఎవరెట్ అనే రెండు కంపెనీలను అటాచ్ చేశారు. మనోజ్‌కు వాళ్లెవరో కూడా తెలియదు. తాము ఇలా డబ్బులు ఇవ్వలేమని, కావాలంటే పార్టీకి ఫండ్ ఇస్తామని షాపూర్జీ పల్లోంజీ కంపెనీ చెప్పింది. తాము చెప్పినట్లు ఇవ్వకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని మనోజ్‌ను శ్రీనివాస్ బెదిరించారు. ఆ విషయాన్ని మనోజ్ ఐటీ అధికారులకు ఇచ్చిన వాంగ్మూలంలో కూడా వెల్లడించారు. ఆ వాంగ్మూలం కాపీలు కూడా ఉన్నాయి.
- ఆ కంపెనీలకు బోగస్ సబ్ కాంట్రాక్టుల కింద డబ్బులు ఇచ్చిన తర్వాత వాటిని వసూలు చేసి చంద్రబాబుకు అప్పగించే బాధ్యతను ఆర్వీఆర్ రఘు, కృష్ణ, నారాయణ్, శ్రీకాంత్, అనికేత్ బలోటాలకు అప్పగించారు. ఇదీ ఈ మోడస్ ఆఫ్ ఆపరెండీ. ఐటీ అధికారులు ఈ సమాచారాన్ని అంతా ఆ కంపెనీల ప్రతినిధుల నుంచి వాంగ్మూలంగా తీసుకుని ఐటీ అప్రైజల్ రిపోర్ట్ తయారు చేశారు. దాన్ని చంద్రబాబు పీఏ శ్రీనివాస్‌కు చూపించారు. అదంతా వాస్తవమేనని శ్రీనివాస్ అంగీకరించి సంతకాలు కూడా చేశారు.
- శ్రీనివాస్‌తోపాటు రఘు, మిగిలిన వారిని కూడా ఐటీ అధికారులు ప్రశ్నించారు. వాళ్లు కూడా అదంతా వాస్తవమేనని అంగీకరించి సంతకాలు కూడా చేశారని ఐటీ అప్రైజల్ రిపోర్ట్ వెల్లడిస్తోంది.
- చంద్రబాబుకు దుబాయిలో కూడా రూ.15.14 కోట్లను దినార్ల రూపంలో క్యాష్‌గా ఇచ్చినట్టు ఐటీ అధికారులకు ఇచ్చిన వాంగ్మూలంలో మనోజ్ అంగీకరించారు. దాంతోనే ఐటీ అధికారులు చంద్రబాబుకు నోటీసులు ఇచ్చారు. స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కుంభకోణంలో కూడా చంద్రబాబుకు ఇలానే మూడు నెలల్లో రూ.371 కోట్లు అందాయి. ఆ కుంభకోణంలో చంద్రబాబుకు డబ్బులు చేర్చిన యోగేశ్ గుప్తానే ఈ వ్యవహారంలో కూడా ఉన్నారు.

● ఇది రూ.2 వేల కోట్ల దోపిడీ


- ఐటీ అధికారులు విశాఖపట్నం, విజయవాడ, కడప, ఢిల్లీ, పూణేల్లో విస్తృతంగా సోదాలు నిర్వహించారు. చంద్రబాబు పీఏ శ్రీనివాస్‌తోపాటు మరికొందరిపై జరిపిన దాడుల్లో లెక్కల్లో చూపని రూ.రెండు వేల కోట్లు దొరికినట్టు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ ట్యాక్సెస్ 2020 ఫిబ్రవరి 13న ఒక ప్రకటనలో వెల్లడించింది. 40 చోట్ల జరిపిన తనిఖీల్లో బోగస్ సబ్ కాంట్రాక్ట్ కంపెనీలు, ఇన్వాయిస్లు, బిల్లులు ఇతర ఆధారాలు లభించాయని చెప్పింది.
- రెండో దశ దర్యాప్తులో భాగంగా ఐటీ అధికారులు 2022 సెప్టెంబర్ 28న చంద్రబాబుకు నోటీస్ ఇచ్చారు. ఈ కేసును డీసీఏసీ-సెంట్రల్ సర్కిల్‌కు బదిలీ చేస్తున్నామని తెలిపారు. ఈ కేసులో త్వరలో చంద్రబాబును కూడా విచారణకు పిలవనున్నారు.
- 2019లో అర్జంటుగా డబ్బులు ఇవ్వాలని మనోజ్ వాసుదేవ్‌కు చంద్రబాబు చెప్పారు. హయగ్రీవా, అన్నై షలాఖా అనే సంస్థలకు రూ.52.50 కోట్లు.. నవోలిన్, ఎవరెట్ కంపెనీలకు రూ.62.90 కోట్లు చొప్పున మనోజ్ చెల్లించారు. చంద్రబాబు ఆదేశాలతో మనోజ్.. ఎల్ అండ్ టీ కంపెనీ నుంచి కూడా డబ్బులు వసూలు చేసి ఇప్పించారు. ఎల్ అండ్ టీ కంపెనీ ప్రతినిధులు అతుల్ సోని, బాల వెంకటేశ్ ఫినిక్స్ ఇన్‌ఫ్రా, ఫోర్ ట్రేడింగ్, లక్ స్టోన్ అండ్ కో బోగస్ కంపెనీల ఖాతాల్లో రూ.41.90 కోట్లు జమ చేశారు. మొత్తం రూ.157.3 కోట్లు మళ్లించారు.
- ఈనాడు రామోజీరావు కుమారుడు కిరణ్ వియ్యంకుడు ఆర్‌వీఆర్ రఘుతోపాటు కృష్ణ, నారాయణ, శ్రీకాంత్, అనికెత్ బల్డోటాలకు ఈ రూ.157.3 కోట్లు చేరాయి. వారు ఆ నిధులను నేరుగా చంద్రబాబుకు చేర్చారు. ఈ వ్యవహారంలో నారా లోకేశ్ పీఏ రాజేశ్ కిలారి కీలక పాత్ర పోషించారు.

● కోట్ల మళ్లింపునకు కోడ్ భాష

- ఆర్‌వీఆర్ రఘు వాట్సాప్ చాట్‌లను ఐటీ అధికారులు పరిశీలించగా.. ఈ అక్రమ ఆర్థిక లావాదేవీలు వెలుగులోకి వచ్చాయి. మనోజ్ వాసుదేవ్ సన్నిహితుడు యోగేశ్ గుప్తా నివాసంపై కూడా ఐటీ అధికారులు దాడులు నిర్వహించారు. చంద్రబాబు ప్రభుత్వంలో స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కుంభకోణంలో నిధుల మళ్లింపులో కూడా యోగేశ్ గుప్తా కీలక పాత్ర పోషించారు. బోగస్ ఇన్వాయిస్‌లు సృష్టించి ప్రజాధనాన్ని కొల్లగొట్టడంలో ఆయనదే ప్రధాన భూమిక.
- ఈ అక్రమ లావాదేవీలను మనోజ్ కోడ్ భాషలో తన ఈ-మెయిల్ ఐడీకే మెయిల్ చేసుకుని భద్రపరిచినట్టుగా ఐటీ అధికారులు గుర్తించారు. ఎవరెవరికి ఎంతెంత మొత్తం చెల్లించింది కోడ్ భాష 'టన్నుల' రూపంలో పేర్కొన్నట్టుగా పూర్తి వివరాలు వెల్లడయ్యాయి. హైదరాబాద్‌కు 3 టన్నులు, ఢిల్లీకి 3 టన్నులు, ముంబాయికి 3.5 టన్నులు.. ఇలా భారీగా నిధులను మళ్లించిన గుట్టును ఐటీ అధికారులు ఛేదించారు.

ఇదే రాష్ట్రం.. ఇదే బడ్జెట్

- ఇంతకు ముందు కూడా ఇదే రాష్ట్రం.. ఇదే బడ్జెట్. అప్పటి ప్రభుత్వం కన్నా అప్పుల గ్రోత్ రేటు ఇప్పుడు తక్కువ. ఇదే బడ్జెట్‌తో మన ప్రభుత్వం నేరుగా బటన్ నొక్కి డీబీటీ ద్వారా ప్రతి అక్క, చెల్లెమ్మల ఖాతాల్లోకి డబ్బులు జమ చేసి ప్రయోజనం కలిగిస్తోంది. నాలుగేళ్లు పూర్తికాక ముందే మన ప్రభుత్వం ఇప్పటికే రూ.2 లక్షల కోట్లు నేరుగా ప్రజల ఖాతాల్లో జమ చేసింది. ఎక్కడా లంచాలు, వివక్షకు తావు లేకుండా బటన్ నొక్కిన వెంటనే అక్కచెల్లెమ్మల ఖాతాల్లోకి డబ్బులు వెళ్తున్నాయి.
- ఇంతకు ముందు చంద్రబాబు ప్రభుత్వంలో కూడా ఇదే బడ్జెట్. అయినప్పటికీ ఎందుకు అక్కచెల్లెమ్మల ఖాతాల్లోకి, వారి కుటుంబాల ఖాతాల్లోకి డబ్బులు వెళ్లలేదు? ఆ డబ్బులు ఎవరి జేబుల్లోకి వెళ్లాయి? దోచుకో, పంచుకో, తినుకో అనే డీపీటీ స్కీం ఎలా చేశారో మొన్న కూడా చెప్పాం. ఈ రోజు మళ్లీ చెబుతున్నాం. గత ప్రభుత్వం ఎలా ఉండేది.. మనందరి ప్రభుత్వంలో ఎలాంటి మార్పు వచ్చిందో, ఎంత మంచి జరుగుతోందో రాష్ట్ర ప్రజలందరూ ఆలోచించాలి.



ఈడీ పట్టుకోదనే కేడీ చంద్రబాబు ధీమా

ఇంతగా ప్రజాధనాన్ని కొల్లగొట్టినా, తనను ఏ ఈడీ కూడా పట్టుకోదనే ఈ కేడీ చంద్రబాబు ధీమా. సీమెన్స్ కేసులో రూ.371 కోట్లు దోచేసిన చంద్రబాబు ఈ కేసులో రూ.172.44 కోట్లు దోపిడీ చేసినట్లు ఇప్పటిదాకా తేలింది. అమరావతి పేరిట ఏదో చేస్తున్నానని ప్రజలను మభ్యపెడుతూ ఇక్కడ చేసింది గోరంత.. కొట్టేసింది కొండంత. దోపిడీ ఆధారాలతో బయటకు వచ్చింది. ఇప్పుడు ప్రజలకు ముఖం ఎలా చూపిస్తావ్ చంద్రబాబూ.. అసెంబ్లీ, సచివాలయం తాత్కాలిక భవనాల నిర్మాణానికి చ.అడుగుకు రూ.12 వేలు చొప్పున దోచి పెట్టారు. బాబు దోపిడీలో దోచుకో పంచుకో తినుకో(డీపీటీ) బ్యాచ్‌లోని రామోజీరావుకూ వాటాలు అందాయి. – గుడివాడ అమర్‌నాథ్, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి

ఫ్లాష్.. ఫ్లాష్...

రోడ్డుప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి

ఖమ్మం క్రైం: జిల్లా కేంద్రంలోని చర్చి కాంపౌండ్ వద్ద శుక్రవారం అర్ధరాత్రి 12.30గంటలకు జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం మేడేపల్లికి చెందిన యువకులు శివ(20), ఉదయ్(23), రవీందర్ శుక్రవారం ఖమ్మం వచ్చారు. పనులు ముగించుకుని రాత్రి 12గంటలు దాటాక స్వగ్రామానికి బయలుదేరారు. ఈక్రమంలో ఒకే వాహనంపై వెళ్తున్న ముగ్గురు అతివేగం కారణంగా చర్చి కాంపౌండ్ వద్ద డివైడర్‌ను ఢీకొట్టారు. తీవ్రగాయాలు కావడంతో వీరిలో శివ, ఉదయ్ అక్కడికక్కడే మృతి చెందగా.. రవీందర్ పరిస్థితి విషమంగా ఉంది. ఖమ్మం వన్‌టౌన్ పోలీసులు ఇచ్చిన సమాచారంతో అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు మృతదేహాలను మార్చురీకి తరలించారు.

గ్రూప్-1 ప్రిలిమ్స్‌కు ఉచిత శిక్షణ

ఖమ్మం మయూరిసెంటర్/ఖమ్మం సహకారనగర్: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో డిగ్రీ ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులైన బీసీ అభ్యర్థులకు బీసీ స్టడీ సర్కిల్ ద్వారా గ్రూప్-1 ప్రిలిమ్స్ ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు కలెక్టర్ గౌతమ్, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ జి.శ్రీలత వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈనెల 28వ తేదీలోగా ఖమ్మంలోని స్టడీ సర్కిల్ కార్యాలయంలో అన్ని సర్టిఫికెట్లు, ఫొటోలతో దరఖాస్తులను అందజేయాలని సూచించారు. కాగా, గతంలో బీసీ స్టడీ సర్కిల్‌లో శిక్షణ తీసుకున్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవద్దని తెలిపారు. ప్రతిభ ఆధారంగా అభ్యర్థులకు ఎంపిక చేసి నిపుణులతో శిక్షణ ఇప్పించడమే కాక ఉచిత పుస్తకాలు, స్కాలర్‌షిప్, మధ్యాహ్న భోజనం ఏర్పాటుచేస్తామని పేర్కొన్నారు. పూర్తి వివరాల కోసం 08742-227427, 95738 59598 నెంబర్లలో సంప్రదించాలని వారు సూచించారు.

ఆస్ట్రేలియా విద్యాసదస్సులో గువ్వలగూడెం వాసి


బ్రహ్మయ్య

నేలకొండపల్లి: ఆస్ట్రేలియాలోని టస్మానియా యూనివర్సిటీలో నిర్వహించిన విద్యాసదస్సులో ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం గువ్వలగూడెంకు చెందిన వంగూరి బ్రహ్మయ్య పాల్గొన్నారు. స్టెప్ ఇన్ లీడ్స్ ఓవర్సీస్ అకాడమీ చైర్మన్‌గా వ్యవహరిస్తున్న బ్రహ్మయ్య తాజాగా ఐదు రోజుల పాటు జరిగిన సదస్సులో పాల్గొని విద్యావిధానంలో వస్తున్న మార్పులు, విద్య, ఉద్యోగావకాశాలు తదితర అంశాలపై జరిగిన సమీక్షల్లో పాలుపంచుకున్నారు.

జిల్లా వార్తలు

శిశువును బతకనిద్దాం.. ఎదగనిద్దాం

- ఆడ, మగ సమానమేనని విస్తృత ప్రచారం
- గర్భస్థ పిండాలను చిదిమేయొద్దని అవగాహన
- లింగ నిర్ధారణ పరీక్షలు చట్ట ప్రకారం నేరం

నేడు భ్రూణ హత్యల వ్యతిరేక దినం



భ్రూణహత్యల నిర్మూలనపై పోస్టర్లు విడుదల చేస్తున్న జిల్లా జడ్జి శ్రీనివాసరావు, కలెక్టర్ గౌతమ్, న్యాయమూర్తి జావేద్‌పాషా తదితరులు (ఫైల్) (ఇన్‌సెట్) ఖమ్మంలో ఏర్పాటు చేసిన హోర్డింగ్

ఖమ్మంలీగల్: గర్భంలోనే పిండాన్ని చిదిమేయడం చట్టరీత్యా నేరం. కానీ ప్రస్తుత సమాజంలోనూ పలువురు ఆడపిల్ల కంటే మగపిల్లలకే ప్రాధాన్యత ఇస్తూ.. గర్భంలో పెరుగుతున్నది ఆడశిశువు అని తెలియగానే భ్రూణహత్యలకు పాల్పడుతున్నారు. ఈ అంశంపై ప్రభుత్వాలు అవగాహన కల్పించడంతోపాటు ఇలా చేసే వారిని శిక్షించేలా చట్టాలు తీసుకొస్తున్నా అడ్డుకట్ట పడడం లేదు. దీంతో అధికారులు చట్టాలను వివరించేలా అవగాహన కార్యక్రమాలను విస్తృతం చేస్తుండగా.. ప్రభుత్వం సైతం ఏటా మార్చి 25న భ్రూణహత్యల వ్యతిరేక దినంగా నిర్వహిస్తూ సమాజంలో ఆడమగ సమానమేని చాటిచెప్పేలా కార్యక్రమాలు చేపడుతోంది. నేడు(శనివారం) భ్రూణహత్యల వ్యతిరేక దినం సందర్భంగా ప్రత్యేక కథనం.

లింగ బేధంతోనే..

సమాజంలో ఉన్న లింగ బేధంతోనే భ్రూణ హత్యలు ఎక్కువగా జరుగుతున్నాయని తెలుస్తోంది. ఆడపిల్లల కన్నా మగ సంతానానికి ఎక్కువ విలువ ఇవ్వడం వల్ల పిండం దశలోనే ఆడ శిశువు చిదిమివేయబడుతోంది. సాంస్కృతిక కట్టుబాట్లు ఇలాంటి దురాచారాలకు కారణమవుతున్నాయి. సమాజంలో ఆడ, మగ సమానమనే భావన అందరిలో కలిగితేనే భ్రూణహత్యల నియంత్రణ సాధ్యమవుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రధానంగా తల్లిదండ్రులు ఈ అంశంపై అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరముంది.

పరీక్ష చేస్తే జైలు, జరిమానా..

గర్భిణి ఆరోగ్యరీత్యా చికిత్స కోసం వైద్యుల సలహా మేరకు స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు గర్భంలో పెరుగుతున్న శిశువు ఆడా, మగా అనేది పరీక్షించాల్సి ఉంటుంది. కానీ చాలాచోట్ల స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు నిబంధనలను విస్మరిస్తున్నారు. దీంతో ప్రభుత్వం గర్భస్థ పిండ పరీక్షల ప్రక్రియ -1994 చట్టాన్ని తీసుకొచ్చింది. ఈ చట్టం ప్రకారం లింగ నిర్ధారణకు పాల్పడడాన్ని నేరంగా పరిగణిస్తారు. లింగ నిర్ధారణ చేసినట్లుగా రుజువైతే మూడేళ్లపాటు జైలుశిక్షతో పాటు రూ.10 వేలు జరిమానా విధిస్తారు. అదే విధంగా వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యుడిని కొన్నేళ్లు సస్పెండ్ చేయడమే కాక వైద్య సర్టిఫికెట్‌ను రద్దు చేసే అవకాశం కూడా ఉంది. డయాగ్నోస్టిక్, స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులపై కూడా క్రిమినల్ కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవచ్చు.

నిరక్షరాస్యత, ఆర్థిక సమస్యలతో..

సమాజంలో నెలకొన్న నిరక్షరాస్యత, ఆర్థిక సమస్యలతో కడుపులో బిడ్డను కడుపులోనే చిదిమేస్తున్నారు. అక్షర జ్ఞానం లేకపోవడంతో పరిస్థితులను అర్థం చేసుకోలేని అమాయకత్వంతో ఆడపిల్లలు వద్దనే ఆలోచన ఇంకా తొలగిపోవడం లేదు. ఇక ఆర్థికపరమైన ఇబ్బందులతో అధిక సంతానం కలగడం వల్ల వారిని పెంచలేమనే ఆందోళన భ్రూణ హత్యలకు మరో కారణమని చెప్పాలి. భ్రూణహత్యలకు ప్రధాన కారణం తల్లిదండ్రులేనని వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పేర్కొంటున్నారు. దీనికి తోడు స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు పుట్టబోయేది ఆడ శిశువా, మగ శిశువా అని నిర్ధారణ చేస్తుండడం, డబ్బులకు ఆశపడి కొందరు ఆర్ఎంపీలు, కొన్ని ప్రైవేట్ ఆస్పత్రుల్లో డాక్టర్లు అబార్షన్ చేస్తున్నా అధికారుల నిఘా లేకపోవడం భ్రూణహత్యలకు ఆగకపోవడానికి ఓ కారణంగా తెలుస్తోంది.

విస్తృతంగా అవగాహన

జిల్లాలో భ్రూణహత్యలను అరికట్టేందుకు న్యాయసేవాధికార సంస్థ, జిల్లా అధికార యంత్రాంగం ద్వారా విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పోస్టర్లు, హోర్డింగ్‌ల ద్వారా ఆడ, మగ ఎవరైనా సమానమేనని, లింగ నిర్ధారణ, అబార్షన్లు చేస్తే విధించే శిక్షలపై ప్రచారం చేస్తున్నారు. ఈ కార్యక్రమాలతోనైనా జిల్లాలో భ్రూణహత్యలకు అడ్డుకట్ట పడాలని ఆశిద్దాం.

భ్రూణహత్యలు చట్టరీత్యా నేరం



లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం చట్టరీత్యా నేరం. పరీక్ష చేసిన వారితో పాటు, చేయించుకున్న వారు శిక్షార్హులవుతారు. భ్రూణహత్యల కారణంగా ఆడ, మగ లింగ నిష్పత్తిలో గణనీయమైన మార్పులు వచ్చాయి. దీనిపై పోస్టర్లు, హోర్డింగ్‌ల ఏర్పాటు, సదస్సులతో ప్రజల్లో విస్తృతమైన అవగాహన కల్పిస్తున్నాం.
– డాక్టర్ టి.శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి, ఖమ్మం

స్కానింగ్ సెంటర్లపై నిఘా



భ్రూణహత్యలతో ఆడపిల్లల మనగడ ప్రశ్నార్థకంగా మారే ప్రమాదముంది. నిబంధనలు విస్మరించే స్కానింగ్ సెంటర్లపై కఠినచర్యలు తీసుకోవాలి. అలాగే, ప్రజల్లో అవగాహన వచ్చేలా వివిధమార్గాల్లో విస్తృత ప్రచారం చేయాలి. న్యాయ సేవాధికార సంస్థ తరపున పోస్టర్లు, హోర్డింగ్‌ల ద్వారా ప్రచారం చేస్తున్నాం.
– మహ్మద్ అబ్దుల్ జావేద్‌పాషా, కార్యదర్శి, న్యాయసేవాధికార సంస్థ

జేకే ఓసీ విస్తరణకు భూముల పరిశీలన


పూసపల్లి అటవీ ప్రాంతంలో పరిశీలిస్తున్న అటవీ, సింగరేణి అధికారులు

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియా పరిధిలోని జేకే ఓసీ విస్తరణలో భాగంగా పూసపల్లి అటవీ ప్రాంతంలో ఉన్న భూములను ఆ శాఖ ఉన్నతాధికారులు శుక్రవారం పరిశీలించారు. సింగరేణి ఏరియా జీఎం ఎం.షాలేము రాజు ఆధ్వర్యాన అటవీశాఖకు సెంట్రల్ ఇంటిగ్రేటెడ్ రీజినల్ ఆఫీసర్ జి.త్రినాథ్‌కుమార్ తదితరులు పూసపల్లి అటవీప్రాంతంలో ఓసీ ప్రభావిత ప్రాంతంలో పర్యటించారు. జేకే ఓసీ విస్తరణకు సేకరించిన పూసపల్లి ఏరియాలో 151 హెక్టార్ల భూమి అటవీ ప్రాంతం కాగా, అనుమతి రావాల్సి ఉంది. ఈమేరకు సింగరేణి అధికారులు లేఖ రాయడంతో అటవీశాఖ ఉన్నతాధికారులు పరిశీలించారు. ఫారెస్టు అడ్వైజర్ సురేంద్ర పాండే, భద్రాద్రి సర్కిల్ సీసీఎఫ్ బీమా నాయక్, డీఎఫ్ఓ లక్ష్మణ్ రంజిత్‌నాయక్, ఎఫ్‌డీఓ అప్పయ్య, సింగరేణి అధికారులు రవిప్రసాద్, గణపతి, మల్లారపు మల్లయ్య, బాలాజీనాయుడు, నాగేశ్వరరావు, మహేశ్వర్, శివవీరకుమార్, ధనుంజరెడ్డి, శ్రీనివాస్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కేయూ పాలకమండలి సమావేశం

- అంచనాల బడ్జెట్, వార్షిక నివేదిక ఆమోదించే అవకాశం
- కోడిఫైడ్ సర్వీస్ రూల్స్‌పై కూడా చర్చ

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పాలకమండలి సమావేశం శనివారం హైదరాబాద్‌లో జరగనుంది. ఈ ఆర్థిక సంవత్సరం 2023-2024 అంచనాల బడ్జెట్, వార్షిక నివేదిక, అకడమిక్ స్టాండింగ్ కమిటీ నిర్ణయాలను చర్చించి అమోదించనున్నారు. యూనివర్సిటీ ఉన్నతాధికారులు ఉదయం 11గంటలకు ఫైనాన్స్ కమిటీ సమావేశం నిర్వహించి ఆదాయ, వ్యయాలపై చర్చించనున్నారు. ఆతర్వాత మధ్యాహ్నం 2గంటలకు పాలకమండలిలో రాష్ట్ర ఉన్నత విద్యా కమిషనర్ నవీన్ మిట్టల్, విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వాకాటి కరుణ, కేయూ వీసీ తాటికొండ రమేష్, ఇతర పాలకమండలి సభ్యులు పాల్గొని చర్చించాక ఆమోదిస్తారు. ఇదే సమావేశంలో యూనివర్సిటీ అకడమిక్‌కు సంబంధించిన అంశాలు, స్టాండింగ్ కమిటీలో నిర్ణయించి ఆమోదించిన వాటిపై కూడా మరోమారు చర్చించి ఆమోదించే అవకాశముంది. పలువురు ప్రొఫెసర్లను పరిపాలనా పదవుల్లో ఇప్పటికే నియమించగా, వీరి నియామకాలను ర్యాటిఫికేషన్ చేస్తారు.

ఉత్తమ అవార్డు ఎంపికపై చర్చ

దూరవిద్య కేంద్రంలోని కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రొఫెసర్ టి.శ్రీనివాస్‌రావును గత విద్యాసంవత్సరంలో రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపకుడి అవార్డుకు ఎంపిక చేయగా ఆయన అవార్డు అందుకున్నారు. అయితే, ఈ విషయమై విమర్శలు రాగా.. హిస్టరీ విభాగం ప్రొఫెసర్ టి.మనోహర్ తనకు రావాల్సిన అవార్డును శ్రీనివాస్‌రావును ఎలా ఇస్తారని యూనివర్సిటీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. దీంతో ఈ అవార్డు ఎంపికపైన పాలకమండలి సమావేశంలో చర్చించే అవకాశముందని తెలిసింది.

నాన్‌టీచింగ్ ఉద్యోగుల కోడిఫైడ్ సర్వీస్ రూల్స్‌పై కూడా..

కాకతీయ యూనివర్సిటీలో నాన్ టీచింగ్ ఉద్యోగుల కోడిఫైడ్ సర్వీస్ రూల్స్‌పై గతంలో రాష్ట్ర ఉన్నత విద్యాకమిషనర్ నవీన్ మిట్టల్, పాలకమండలి సభ్యులు డాక్టర్ నాగేంద్రబాబు, డాక్టర్ చంద్రమౌళితో కూడిన సబ్ కమిటీ వేశారు. ఆ కమిటీ నివేదిక ఇచ్చిన నేపథ్యాన శనివారం జరిగే సమావేశంలో చర్చించి సర్వీస్‌రూల్స్‌ను ఆమోదించే అవకాశాలున్నాయి. ఇప్పటివరకు నాన్‌టీచింగ్ ఉద్యోగుల నియామకాలు, పదోన్నతులపై సర్వీస్ రూల్స్ లేకున్నా తీసుకుంటున్న నిర్ణయాలతో సమస్యలు ఉత్పన్నమయ్యాయి. దీంతో 2016నుంచి యూనివర్సిటీ ఉద్యోగులకు ప్రత్యేకంగా కోడిఫైడ్ సర్వీస్ రూల్స్ కావాలని డిమాండ్ చేస్తుండగా, తాజా సమావేశంలో ఆమోదించే అవకాశముందని తెలుస్తోంది.

పెద్దమ్మతల్లి ఆలయ పాలకమండలికి మోక్షం

పాల్వంచరూరల్: ఆరు నెలల తర్వాత పెద్దమ్మతల్లి ఆలయ కమిటీ పాలకవర్గానికి మోక్షం లభించింది. ఈ మేరకు ప్రభుత్వం శుక్రవారం జీఓ జారీ చేసింది. ఈ కమిటీ పాలకవర్గ గడువు గతేడాది అక్టోబర్ 9న ముగియగా, కొత్త కమిటీని తిరిగి నియమించలేదు. గత కమిటీలో 12 మంది సభ్యులు ఉండగా, అదనంగా ముగ్గురిని కలిపి 15 మంది సభ్యులతో నూతన కమిటీని నియమిస్తూ ప్రభుత్వ కార్యదర్శి వి.అనిల్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో మహిపతి రామలింగం, చింత నాగరాజు, గంధం వెంగళరావు, ముత్యాల ప్రవీణ్‌కుమార్, ఆడెపు చిన్నవెంకట్రామయ్య, బండి చిన్న వెంకటేశ్వర్లు, చందుపట్ల శ్రీనివాసరెడ్డి, మాలోతు సువాలి, కాటారపు లక్ష్మీనారాయణ, కిలారు నాగమల్లేశ్వరరావు, ఎస్‌వీఆర్‌కే.ఆచార్యులు, బేతంశెట్టి విజయ్‌కుమార్, సంకా వెంకటరామరావు, పాయం పాపయ్యతోపాటు అర్చకులు రవికుమార్‌శర్మ ఉన్నారు. కాగా, కమిటీ నియామకంపై తమకెలాంటి సమాచారం అందలేదని ఈఓ ఎస్.రజనీకుమారి తెలిపారు.